నల్లమల గ్రామాలకు ఆర్టీసీ బస్సు పునఃప్రారంభం

» ఊరూరా బస్ సర్వీస్‌కు పల్లె జనం ఘన స్వాగతం 7

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

» జోగులాంబ గద్వాల జిల్లాలో ఇద్దరు » నారాయణపేట జిల్లాలో ఒకరు

తెలంగాణ టు కర్ణాటక

- కృష్ణానదిలో రోడ్డు వేసి దర్జాగా ఇసుకను దోచుకెళుతున్న మాఫియా
- అడ్డొస్తే దాడులు, పోలీసులతో వేరే కేసుల్లో ఉల్టా బెదిరింపులు
- టెండర్లు లేవు, అనుమతి లేదు, అయినా యథేచ్ఛగా తరలింపు
- ఓ కీలక ప్రజాప్రతినిధి హస్తం ఉండటంతో అధికారుల నిద్రమత్తు
- అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇసుక మాఫియా అంతా కుమ్మక్కు



కృష్ణానది నుంచి కర్ణాటకకు ఇసుకను తరలిస్తున్న టిప్పర్లు



గుడెబల్లూరు-ముడుమాల్ శివారులోని మురహర్ దొడ్డి వెళ్లే మార్గం వద్ద ఇసుకను తరలించేందుకు నదిలో వేసిన మట్టి రోడ్డు

మహబూబ్‌నగర్, మే 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాష్ట్రంలో నిర్మాణ అవసరాలకు అనుగుణంగా ఇసుక దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ దొరికినా అడ్డగోలు రేట్లు ఉండటంతో నిర్మాణరంగం కుంటుపడుతున్న పరిస్థితి. గతంలో యథేచ్ఛగా సాగిన దందాకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం టీజీఎండీసీ ద్వారా ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇస్తోంది. కొన్నిచోట్ల ఇంకా ఇసుక రీచ్‌లకు అనుమతులు లేకుండానే దందా సాగుతోంది. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలో మాత్రం కృష్ణానది నుంచి ఇసుక రోజూ వందలాది టిప్పర్లతో కర్ణాటకకు తరలిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు అంతా కలిసే ఈ దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఇసుక తవ్వాలంటే రీచ్ కోసం ప్రభుత్వం టెండర్లు వేయాలి. టెండర్ దక్కించుకున్న వారికి ఇన్ని క్యూబిక్ మీటర్ల వరకు ఏ పద్ధతిలో ఇసుక తవ్వుకోవచ్చో అనుమతులు ఇస్తారు. కానీ మక్తల్ నియోజకవర్గంలో టెండర్లు లేవు, అనుమతులు లేవు, నిత్యం కర్ణాటకలోని యాదగిరి జిల్లా సైదాపూర్, కడ్లెచూరు, రాయిచూరు ప్రాంతాలకు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. సాధారణంగా కృష్ణానదిలో ఇసుక లభ్యత దాదాపు ఉండదు. కృష్ణా ఎగువ పరివాహకంలో మొత్తం నల్లరేగడి భూములు ఉండటంతో ఒండ్రు మాత్రమే వస్తుంది. అయితే కృష్ణా- భీమా నదులు కలిసే సంగమ ప్రాంతం ఒక్కచోటనే ఇసుక లభ్యత ఉన్నది. ఇప్పుడు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో కర్ణాటక గుత్తేదారులు టిప్పర్లతో ఇసుకను కొల్లగొడుతున్నారు.

నదిలో రోడ్డు...

కర్ణాటక నుంచి వచ్చే కృష్ణానది, మహారాష్ట్ర నుంచి వచ్చే భీమా నది నారాయణపేట జిల్లా తంగిడిగి

(మిగతా 6లో..)

ఆయనకు రోజుకు రూ. 3 లక్షలు..

కర్ణాటకకు ఇసుక తరలింపులో ఓ కీలక ప్రజాప్రతినిధి, పోలీసుల్లో కీలక అధికారుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆ కీలక ప్రజాప్రతినిధికి రోజుకు రూ. 3 లక్షల మేర ముట్టజెప్పుతున్నట్లు తెలుస్తోంది. అందుకే పోలీసులు ఎవరి మీద కూడా చర్యలు తీసుకోవడం లేదని విమర్శ ఉన్నది. ఒకవేళ టెండర్ వేసి ఇసుక తరలిస్తే తక్కువ రాబడి ఉంటుందని భావించే ఇప్పటివరకు ఇసుక లభ్యత ఉన్నా టెండర్లు వేయడంలేదు. కేవలం ఇసుక కోసమే పార్టీ మారిన కొందరు అధికార పార్టీ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు దందా నడిపిస్తున్నారు. వీరికి గులాబీ పార్టీ నుంచి కూడా ప్రత్యేక మద్దతు ఉన్నది. అందులో కీలక నేతలు కూడా ఇసుక దందాలో భాగస్వాములుగా ఉన్నారు. ఇటీవల టిప్పర్లను ముడుమాల్ గ్రామస్తులు అడ్డుకోగా వారి సెల్‌ఫోన్లు ధ్వంసం చేసి దాడి చేశారు. అంతకుముందు కూడా గ్రామంలో పలువురిపై దాడులు జరిగాయి. మీడియాపై కూడా దాడి చేసిన సందర్భాలు ఉన్నాయి. ఎవరైనా పోలీసు స్టేషన్‌కు వెళ్తే నిమిషంలో మాఫియా నుంచి వారికి ఫోన్ వస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు కూడా ఇతర కేసుల్లో వారిని ఇరికించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ కీలక ప్రజాప్రతినిధి అండదండలు ఉండటంతో ఏమీ కాదనేది వారి భరోసా కావొచ్చు. కానీ తెలంగాణ అవసరాలకు వినియోగించాల్సిన ఇసుకను కర్ణాటకకు తరలించడంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించాలి.. అనుమతులు ఇచ్చి ఇసుక రవాణా చేసుకునే ఏర్పాట్లు చేయాలి.



అభివాదం చేస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి, పార్టీ నాయకులు

పనిచేసే వారికే పదవులు

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి
- ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటా : ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి, మే 21 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కన పెడితే పార్టీ మనుగడ కష్టమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ అధ్యక్షతన టీపీసీసీ పరిశీలకులు సంజయ్ ముదిరాజ్, గౌరీ, సతీష్‌ల సమక్షంలో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీలలో కొన్ని గ్రామాల్లో పార్టీ కోసం పని చేసిన వారికి సమాచారం ఇవ్వకుండా కమిటీలు వేయడం బాధకరమన్నారు. పార్టీ కోసం 45 సంవత్సరాలుగా కష్టపడి పనిచేసి 9 సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశానని తెలిపారు. మాలాంటి వాళ్లని పక్కన పెట్టి డబ్బుఉన్న వాళ్లకు టికెట్లు ఇచ్చినా.. పార్టీ కోసం పనిచేసి గెలిపించుకున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాయకుల మధ్య విభేదాలు ఉన్న 35 నియోజకవర్గాలు ఉన్నాయని, ఆ ప్రాంతా లలో పార్టీ సమన్వయ కమిటీలు వేసి ఆ కమిటీల ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలు చేపడితే పార్టీకి మనుగడ ఉంటుందన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మా ట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తేదీ వరకు నాతో పాటు ఉండి పార్టీ కోసం పనిచేసిన వారికి గతంలో ఇచ్చిన హామీ మేరకు పదవులు ఇస్తామ న్నారు. ఇప్పుడు వచ్చిన వారికి పదవులు ఇచ్చే ప్రసక్తి లేదని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్ల అభ్యర్థులు గెలిచేలా ప్రతీ ఒక్కరు పని చేయాలని సూచించారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన వారికి పార్టీ పదవులు ఇవ్వాలని, ఇందుకోసం అందరూ కలిసికట్టుగా సమన్వయం చేసుకుని కృషి చేయాలని సూచించారు. టీపీసీసీ పరిశీలకులు సంజయ్ ముదిరాజ్, గౌరీ సతీష్‌లు మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ ఏడాది నుంచే.. లా, ఇంజనీరింగ్ కోర్సులు

» పాలమూరు యూనివర్సిటీలో ప్రారంభానికి చురుగ్గా ఏర్పాట్లు

» వసతి గృహాల ఏర్పాటుకు చర్యలు 7





అమరచింతలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని సన్మానిస్తున్న నాయకులు



కర్ణాటకలోని ఆర్డీఎస్ ప్రధాన ఆనకట్ట పై నుంచి పారుతున్న వరద

'జూరాల'కు స్వల్పంగా వరద

» జూరాలలో ప్రస్తుతం 0.741టీఎంసీల నీటి నిల్వ

» 'సుంకేసుల' నుంచి నీటి విడుదల

» జల కళ సంతరించుకున్న తుంగభద్ర 6



జూరాల ప్రాజెక్టులోకి చేరుతున్న వరద

సరి'హద్దులు' దాటుతున్న రేషన్ బియ్యం

» రూటు మార్చిన మాఫియా

» బల్గెర, గట్టు మీదుగా కర్ణాటకకు తరలింపు

» రాత్రి వేళ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిల్ 7

రూ.1.80 కోట్లతో మినీ ఇండోర్ స్టేడియం

- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

అమరచింత/ఆత్మకూరు, మే 21(ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఆత్మకూరు, అమరచింత మండలాల్లో ఇండోర్ స్టేడియం నిర్మాణాలకు కట్టుబడి ఉన్నానని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, రాష్ట్ర కాంగ్రెస్ కల్లు విభాగం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్‌తో కలిసి అమరచింత, ఆత్మకూరులలో పర్యటించి క్రీడా మైదానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరచింత హైస్కూల్ గ్రౌండ్‌లో ఇండోర్ స్టేడియం కోసం కోటి రుపాయలు, ఆత్మకూరు తేరు మైదానంలో మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మక్తల్ నియోజకవర్గంలో మక్తల్, అమరచింత, ఆత్మకూరు క్రీడా మైదానాలపై ఎమ్మెల్యేకు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఇక్కడ ప్రొ కబడ్డీ క్రీడాకారులు ఉన్నందున కబడ్డీ మ్యాట్ ఇచ్చే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఇప్పటికే జిల్లాకు ఒక కబడ్డీ మ్యాట్ చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలకు మ్యాట్‌లు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం మే డే ఉత్సవాలలో భాగంగా బస్టాండ్ సెంటర్‌లో కాంగ్రెస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆత్మకూరు, అమరచింత నాయకులు, కార్యకర్తలు, కార్మిక విభాగం నాయకులు పాల్గొన్నారు.

భూ భారతిపైనే ఆశలు

- వనపర్తి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా గోపాల్‌పేట
- మండలంలో ముగిసిన రెవెన్యూ సదస్సులు
- భూ సమస్యలపై 571 దరఖాస్తులు
- ఈ నెల చివరి వరకు పరిష్కరించేలా కసరత్తు
- జూన్ 2 నుంచి అన్ని మండలాల్లో అమలు..!



గోపాల్‌పేట మండలంలోని జయన్న తిరుమలాపూర్‌లో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి (ఫైల్)

వనపర్తి, మే 21(ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ హయాంలో తీసుకొచ్చిన ధరణి చట్టంతో భూ సమస్యలను పరిష్కరించుకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణి చట్టాన్ని మార్చి భూ భారతి చట్టాన్ని అమలులోకి తీసు కొచ్చింది. అందులో భాగంగా మొదట రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాలోని ఒక్కొక్క మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. వనపర్తి జిల్లాలో గోపాల్‌పేట మండలాన్ని ఎంపిక చేసి ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు రెండు బృందాలుగా ఏర్పడి 10రోజుల పాటు ఆయా గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులలో భూ సమస్యలపై 571 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ప్రధానంగా మిస్సింగ్ సర్వే నెంబరు, సాదాబైనామా, పెండింగ్ మ్యూటేషన్, అసైన్‌మెంట్ తది తర సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల విచారణ త్వరితగతిన పూర్తి చేసి జూన్ 2వ తేదీలోగా పరిష్కరించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కలెక్టర్ పర్యవేక్షణలో..

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగానే మొదట పైలట్ ప్రాజె క్టుగా జిల్లాలో గోపాల్‌పేట మండలాన్ని ఎంపిక చేసి ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులను కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం పర్యవేక్షిస్తూ భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులలో స్వీకరించిన దరఖా స్తులను పరిశీలించేందుకు రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలోకి వెళ్తున్నారు.

జూన్ 2వ తేదీ నుంచి అన్ని మండలాల్లో

ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మండలాల్లోనే రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. జూన్ 2వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల కలెక్టరేట్‌లో కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించి గోపాల్‌పేట మండలంలో రెవెన్యూ సదస్సులకు వచ్చిన దరఖాస్తులను జూన్ 2వ తేదీలోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జూన్ 2వ తేదీ నుంచి అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు.



కొల్లాపూర్ మార్కెట్‌లో సింగిల్‌విండో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

17శాతం తేమ ఉన్నా.. దొడ్డు ధాన్యం కొనాల్సిందే

- సింగిల్‌విండో సీఈవోపై కలెక్టర్ ఆగ్రహం

కొల్లాపూర్, మే 21(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు రకం ధాన్యం 17శాతం తేమ ఉన్నా కొనాల్సిందేనని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు.బుధవారం కొల్లాపూర్ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సన్న రకం ధాన్యం 14 శాతం, దొడ్డు రకం ధాన్యం 17శాతం తేమ ఉన్నా కొనాల్సిందేనని సిబ్బందిని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం చేసిన సింగిల్‌విండో సీఈవో శ్రీనివాసులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్ప వని హెచ్చరించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో భన్సీలాల్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

గద్వాల సర్కిల్/వనపర్తి విద్యావిభాగం/నాగర్‌కర్నూల్ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నారు. ఈ నెల 29వ తేదీ వరకు కొనసాగే ఈ పరీక్షలకు అధికారులు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలకు గద్వాల జిల్లా వ్యాప్తంగా 11 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 3,421 మంది విద్యార్థులు (ఫస్టియర్ 2,248, సెకండియర్ 1,173) హాజరుకానున్నారని డీఐఈవో, ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ హృదయరాజు తెలిపారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇంటర్మీడియట్ అధికారి ఎర్ర అంజయ్య తెలిపారు. ప్రథమ సంవత్సరం 3,631 విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 2091 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 20 కేంద్రాలను ఏర్పాటు చేయగా మొత్తం 6,045 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని జిల్లా ఇంటర్ విద్యా నోడల్ అధికారి వెంకటరమణ తెలిపారు. నిర్ణీత సమయం కంటే గంట ముందుగా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.



గద్వాల జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

మక్తల్ మండలం మస్తాన్‌పల్లిలో కొనసాగుతున్న ఫారమ్‌పండ్ పనులు




'ఉపాధి' కోత



మక్తల్ మండలం అకన్‌పల్లిలో ఉపాధి పనుల్లో కూలీలు

- ఐదేళ్లలో తగ్గిన 17.96 లక్షల పని దినాలు
- కొత్త నిబంధనలతో తప్పని తిప్పలు
- 'పేట' జిల్లాలో 1,10,807 జాబ్‌కార్డులు
- 2,01,207 మంది 'ఉపాధి' కూలీలు



నారాయణపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఏటా ఉపాధి హామీ పథకం పనిదినాలను తగ్గిస్తూ భారీ కోత విధిస్తోంది. దాంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు. సంస్కరణల పేరుతో నిబంధనలను కఠినతరం చేస్తున్నారని వారు చెప్తున్నారు. దీంతో తాము ఇబ్బంది పడుతున్నామని అంటున్నారు. ఉన్న ఊరిలోనే కూలీలకు ఉపాధి కల్పించి వారు పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లకూడదనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2008లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి ఈ పథకం ద్వారా కూలీలకు ఉన్న ఊరిలోనే పని దొరుకుతోంది. అయితే గత నాలుగేళ్లుగా పని దినాల్లో కోత పెడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కేంద్రం నిర్ణయించిన 266 పనులు మాత్రమే చేపట్టాలనే నిబంధన ఇబ్బందిగా మారుతోందని కూలీలు చెప్తున్నారు. గతంలో కూలీలు ఉదయం ఆరుగంటలకే పనులకు వెళ్లి, పనులు పూర్తి చేసుకొని మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లిపోయేవారు. కానీ తాజా నిబంధనల మేరకు ఉదయం ఒక సారి, మధ్నాహ్నం తర్వాత మరో సారి ఉపాధి పనులకు సంబంధించిన ఫొటోలు తీసి ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో కూలీలు అధికారుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. అయితే వేసవి నేపథ్యంలో కూలీలు ఉదయం ఆరు నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పనులు చేసుకునేందుకు ప్రభుత్వం వెసలుబాటు కల్పించింది. రోజు వారీ కూలి రూ.307గా నిర్దేశించింది.

పని చేస్తున్న కూలీలు 78,807 మంది

నారాయణపేట జిల్లావ్యాప్తంగా జాబ్‌కార్డులు 1,10,807 ఉండగా, కూలీలు 2,01,207 మంది ఉన్నారు. అందులో యాక్టివ్ జాబ్‌కార్డులు 50,187 కాగా, యాక్టివ్ లేబర్ 78,807 మంది ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో 30.2 లక్షల పని దినాలను 12.24 లక్షలకు తగ్గించింది. దీంతో ఏకంగా 17.96 లక్షల పని దినాలు తగ్గాయి. ఉపాధి హామీ ద్వారా ప్రస్తుతం జిల్లాలో ఫారం పాండ్ పనులు, రైతుల పొలాల్లో కందకాలు తవ్వకం, రోడ్డు నిర్మాణ పనులు, పశువుల షెడ్లు, పౌల్ట్రీ షెడ్లు, నర్సరీల ఏర్పాటు, ఫిష్ పాండ్, సోక్‌పిట్స్ తదితర పనులు కొనసాగుతున్నాయి.

పని దినాలు తగ్గించొద్దు



కేంద్ర ప్రభుత్వం పని దినాలు తగ్గించడం సరి కాదు. పొద్దస్తమానం పని చేసినా రోజు కూలీ రూ. 240 కూడా పడడం లేదు. పని దినాలు పెంచాలి. అలాగే రోజుకూలీ రూ. 307 నుంచి రూ. 500కి పెంచాలి.

- అమృతమ్మ, ఉపాధి కూలీ, మరికల్

క్యాన్సర్ స్ర్కీనింగ్‌పై అవగాహన కల్పించాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అల్లె శ్రీనివాసులు



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అల్లె శ్రీనివాసులు

వనపర్తి వైద్యవిభాగం, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో అందించే క్యాన్సర్ స్ర్కీనింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అల్లె శ్రీనివాసులు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల వైద్యాధికారులకు క్యాన్సర్ స్ర్కీనింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్, పురుషులు ప్రొస్టేట్, ఒంటరి క్యాన్సర్ బారిన పడుతుంటారని అన్నారు. క్యాన్సర్ మహమ్మారిని ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందితే నయం చేయవచ్చన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న క్యాన్సర్ నిర్ధారణ కేంద్ర సదుపాయాన్ని ప్రజలు ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం



పెళ్లి కూతురు జ్యోతికి ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

చారకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూపల్లి గ్రా మానికి చెందిన దివంగత మాజీ ఎంపీటీసీ సభ్యుడు అర్కంటి బాల స్వామి కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దాంతో కు టుంబం ఇంటి పెద్ద దిక్కును కోల్పోయింది. బాలస్వామి కూతురు జ్యోతి వివాహం సందర్భంగా నాయకులు ఆ పేదింటి ఆడ బిడ్డ పెళ్లికి ఆదుకోవాలని చారకొండ, వెల్దండ, కల్వకుర్తికి చెందిన నాయకులు ముందుకు వచ్చారు. బుధవారం కల్వకుర్తి మార్కెట్ చైర్మన్ మనీలా సంజీవ్‌యాదవ్, రూ.లక్ష క్వింటాల్ బియ్యం, డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్ రూ.20 వేలు, కల్వకుర్తి మాజీ మునిసి పల్ చైర్మన్ యడ్మ సత్యం రూ.20 వేలు, ఉమ్మడి వెల్దండ మండ లానికి చెందిన నాయకులు మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, సాంబయ్య గౌడ్, గోపాల్‌రెడ్డి, ఐజాక్, జయంత్‌లు రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని జూపల్లికి వెళ్లి పెళ్లి కూతురు జ్యోతి, ఆమె తల్లి యాదమ్మకు అందజే శారు. బాలస్వామి కుటుంబానికి అండగా ఉంటామని వారు పేర్కొ న్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలి



డీలర్ షాపులను తనిఖీ చేస్తున్న వ్యవసాయ సంచాలకుడు పూర్ణచంద్రారెడ్డి

కందనూలు, మే 21 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేయాలని సహాయ వ్యవసాయ సంచాకులు పూర్ణచంద్రారెడ్డి, మండల వ్యవసాయ అధికారి సీహెచ్.రాజులు అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ పట్టణ పరిధిలోని విత్తన లైసెన్సు కలిగిన డీలర్ల షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లందరూ ఎమ్మార్పీ ధరలకే విత్తనాలను విక్రయించాలని, ముఖ్యంగా పత్తి విత్తనాలు అన్ని రకాలు ఒకే రకమైన దిగబడి వస్తాయన్నారు. రైతు ప్రతీ ప్యాకెట్‌కు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పంటకాలం ముగిసే వరకు బిల్లు భద్రంగా ఉంచుకోవాలని అన్నారు. అదేవిధంగా బిల్లు బుక్స్, ఇన్వాయిస్, స్టాక్ రిజిస్టర్స్ పరిశీలించారు.

పిల్లలను రక్షించుకోవడం మన బాధ్యత

- జిల్లా షీటీం ఇన్‌చార్జి విజయలక్ష్మి



టీచర్లకు అవగాహన కల్పిస్తున్న షీటీం ఇన్‌చార్జి విజయలక్ష్మి

కందనూలు, మే 21 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను రక్షించుకోవడం మన బాధ్యత అని జిల్లా షీటీం ఇన్‌చార్జి విజయలక్ష్మి అన్నారు. బుధవారం జిల్లాలో టీచర్ల కోసం నిర్వహించిన డిస్ట్రిక్ట్ లెవెల్ 5డేస్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్‌లో ఆమె మాట్లాడారు. ఈవ్‌టీజింగ్, సోషల్‌మీడియా వేధింపులు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మికులు, సైబర్ క్రైం, సైబర్ బెదిరింపులు, వేసవి సెలవుల్లో వేధింపులు ఇలాంటి ఏవి ఉన్నా మహిళలు నిర్భయంగా షీటీం కార్యాలయానికి వచ్చి తెలియజేయాలని అన్నారు. మహిళలు, విద్యార్థులకు వేధింపులకు గురైతే షీటీం అండగా ఉంటుందన్నారు. ఫిర్యాదులు ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నుంచి మహిళలను రక్షించడం కోసం పీవోఎస్‌హెచ్ యాక్ట్ 2013 గురించి వివరిస్తూ ప్రతి పది మంది ఉద్యోగం చేసే దగ్గర మహిళల కోసం ఒక ఇంటర్నల్ కమిటీ ఉండాలని చెప్పారు. భరోసా కో ఆర్డినేటర్ శ్రీలత భరోసా సేవలు వివరించారు. కొన్ని పోక్సో కేసు స్టోరీస్ వివరించారు. ఈ కార్యక్రమంలో షీటీం మెంబరు వెంకటయ్య, జీసీడీవో శోభారాణి, సూర్యచైతన్య, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాలింపు చర్యలు నిలిపివేత


- లభించని రైతు తిప్పన్న ఆచూకీ
- ఇన్‌చార్జి తహసీల్దార్ పుష్పలత
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ




ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, అధికారులు రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న పేట ఎస్పీ యోగేష్ గౌతమ్

కృష్ణ, మే 21 (ఆంధ్రజ్యోతి) : భీమా నదిలో మొసలి లాక్కెళ్లడంతో గల్లంతైన రైతు కోసం గాలింపు చర్యలను నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ పుష్పలత తెలిపారు. జింకల తిప్పన్న (55) అనే రైతు నీటి పంపు ఫుట్‌బాల్ మరమ్మతు కోసం భీమా నదిలోకి దిగగా మొసలి లాక్కెళ్లింది. అతడి ఆచూకీ కోసం నాలుగు రోజుల నుంచి జాలరులు, గజ ఈతగాళ్లు, అగ్నిమాపక ఇబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్, బోటింగ్ ఫారెస్టు బృందాలు గాలిస్తున్నాయి. బుధవారం సాయంత్రం వరకు గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో ఇన్‌చార్జి తహసీల్దార్ పుష్పలత కలెక్టర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అనంతరం తిప్పన్న భార్య తిమ్మవ్వ, ఇతర కుటుంబసభ్యులు, గ్రామస్థులతో ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడారు. తిప్పన్న కేవలం లోదుస్తులతో నదిలో దిగడం వల్ల, మొసలి పూర్తిగా తిని ఉండొచ్చని, అందుకే ఆచూకీ లభించలేదని వారు అభిప్రాయపడ్డారు. అంతే కాకుండా సంఘటన స్థలంలో మొసలి తిరుగుతూ ఉండటంతో గజ ఈతగాళ్లు, సహాయక బృందాల సభ్యులు నదిలోకి దిగే పరిస్థితి లేదు. దీంతో గాలింపు చర్యలను నిలిపివేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. అంతకుముందు సంఘటన స్థలాన్ని ఎస్పీ యోగేష్ గౌతమ్ పరిశీలించారు. సంఘటన, గాలింపు చర్యల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కృష్ణ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలోని ఖాళీ స్థలంలో మొక్కలు నాటాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్లో వసతులు, కేసులు, ఫిర్యాదులు తదితర వివరాలను ఎస్‌ఐ నవీద్‌తో మాట్లాడి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట మక్తల్ సీఐ రామ్‌లాల్, ఇన్‌చార్జి తహసీల్దార్ పుష్పలత, ఆర్‌ఐ మదన్‌మోహన్ రెడ్డి, ఏఎస్‌ఐ సురేంద్రబాబు ఉన్నారు.

వదిన అంత్యక్రియలకు వెళ్తూ.. గుండె పోటుతో మరదలు మృతి



పేరూర్ నర్సమ్మ మూసాపేట, (ఫైల్)



చాకలి చంద్రమ్మ ముచ్చింతల (ఫైల్)

మూసాపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : వదిన అంత్యక్రియలకు వెళ్తూ మార్గం మధ్యలో మరదలు గుండె పోటులో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, కౌకుంట్ల మండలంలోని ముచ్చింతల గ్రామానికి చెందిన చాకలి చంద్రమ్మ(65)కు మంగళవారం గుండెపోటు రావడంతో, హైదరాబాద్‌లోని అనుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం చనిపోవడంతో మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. అంత్యక్రియలకు హాజరయ్యేందుకు ఆమె మరదలు, మూసాపేట గ్రామానికి చెందిన పేరూరు నర్సమ్మ (56) బయలు దేరింది. జిల్లా కేంద్రం నుంచి దేవరకద్ర బస్టాండ్‌కు చేరుకున్న ఆమె ముచ్చింతలకు వెళ్లేందుకు ఆటోకోసం వేచి ఉన్నది. అదే సమయంలో ఆమె గుండెపోటుకు గురై అక్కడే మృతి చెందింది. ఆమె భర్త సత్తన్న సైన్యంలో పని చేస్తూ పదేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమెకు ముగ్గురు కుమార్తెలున్నారు. ఒకే రోజు అత్త, తల్లి చనిపోవడంతో ఆమె రెండో కూతురు శోభారాణి కన్నీరు మున్నీరుగా విలపించింది.

ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎంగా కవిత

ఉప్పల్ వర్క్‌షాప్ నుంచి పదోన్నతిపై రాక

మహబూబ్‌నగర్ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎంగా కవిత నియామకమయ్యారు. జిల్లాకు చెందిన కవిత ప్రస్తుతం హైదరాబాద్ ఉప్పల్ వర్క్‌షాప్‌లో వర్క్స్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. 2012లో మహబూబ్‌నగర్ డిపో మేనేజర్‌గా పని చేశారు. ఖమ్మం డిప్యూటీ ఆర్‌ఎంగా పనిచేస్తూ గత నెలలో ఇక్కడికి బదిలీపై వచ్చిన భవానీప్రసాద్ పదోన్నతిపై ఆదిలాబాద్ రీజియన్ మేనేజర్‌గా వెళ్లారు.

తెలంగాణ టు కర్ణాటక



ముడుమాల్ గ్రామస్థులు అడ్డుకోవడంతో నిలిచిపోయిన టిప్పర్లు

(5వ పేజీ తరువాయి)

దత్తభీమేశ్వరాలయం వద్ద సంగమమవుతాయి. ఈ క్రమంలో కుసుమూర్తి, గురుజాల్, హిందూపూర్, గుడెబల్లూరు, ముడుమాల్, శివారుల్లో ఇసుక మేటలు ఏర్పడతాయి. గుడెబల్లూరు- ముడుమాల్ శివారులోని మురహర్ దొడ్డి వెళ్లే మార్గం దగ్గర ఓంకారేశ్వర మఠం, మణికంఠ ఎత్తిపోతల పథకంపై భాగానికి వెళ్లేందుకు నదిలో కిలోమీటర్ల మేర మట్టిరోడ్డు వేశారు. ఆ మట్టి రోడ్డుపై నిత్యం హిటాచీలు, టిప్పర్లు వెళుతున్నాయి. రోజుకు 100 నుంచి 200 వరకు టిప్పర్లు ఉదయం- రాత్రి అనే తేడా లేకుండా ఇసుకను కర్ణాటకకు తరలిస్తున్నాయి. ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వచ్చినప్పుడు మిన హా పోలీసులు, అధికారులు మిగతా సందర్భాల్లో అసలు స్పందించని పరిస్థితి. ఎవరికి అందే మామూళ్లు వారికి అందుతున్నాయి. టెండర్లు దక్కి అనుమతులు ఉంటేనే ఇసుకను తరలించడానికి గుత్తేదార్లు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు. టెండర్లు లేకుండా ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి పక్క రాష్ట్రానికి ఇసుకను తరలిస్తున్నా పట్టింపులేదు. పోలీసులను అడిగితే రెవెన్యూ అధికారులపై రెవెన్యూ అధికారులను అడిగితే నది కాబట్టి ఇరిగేషన్ అధికారులపై వారిని అడిగితే ఇసుక కాబట్టి మైనింగ్ అధికారులపై చెబుతూ తప్పించుకుంటున్న పరిస్థితి ఉన్నది. జిల్లా ఉన్నతాధికారులు, పోలీస్ బాస్‌లకు కూడా ఇందులో ఆర్థిక సంబంధాలు ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. అందుకే ఎవరైనా ముడుమాల్, గుడెబల్లూరు గ్రామస్థులు ఫిర్యాదు చేసినా పట్టించుకోరు. ఉల్టా మీరెందుకు ఆ టిప్పర్లను ఆపుతున్నారు. అడ్డుకుంటే వారు చంపడానికి వెనుకాడరు అని పోలీసులు బెదిరిస్తున్న పరిస్థితులు ఉన్నాయి.



ఇసుకను టిప్పర్‌లో నింపుతున్న ఎక్స్‌కవేటర్

ఇసుక లారీ పట్టివేత



అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్న పోలీసులు

కొత్తపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అ క్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకు న్నారు. కోయిలకొండ నుంచి కొడంగ ల్ వైపు ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీని పెద్దపూర్ గ్రామ శివారులో పోలీసులు తనిఖీ చేశారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి లారీ ని మద్దూరు స్టేషన్‌కు తర లించారు. ఒట్టుపల్లి తండాకు చెందిన లారీ డ్రైవర్ శ్రీనివాస్, తుంకిమెట్ల తండాకు చెందిన లారీ యజమాని దేవ్‌సింగ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

'జూరాల'కు స్వల్పంగా వరద

గద్వాల, మే 21 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో జూరాల జలాశయానికి స్వల్పంగా వరద వస్తోంది. కర్ణాటకతో పాటు కృష్ణా పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వానలతో జూరాల ప్రాజెక్టులోకి 3,150 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.65 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.404 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వినియోగంలోకి వచ్చే నీరు 0.741 టీఎంసీలు మాత్రమే ఉంది. వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు, చివరి తడి కోసం రైతులు ఆందోళనలు చేపట్టారు. అయినా మొదటి ప్రాధాన్యం తాగునీటికే అని ఇరిగేషన్ అధికారులు ప్రకటించి, 0.200 టీఎంసీ నీరు ఉండగానే, కాలువలకు నీటి విడుదలను నిలిపి వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కొన్ని రోజుల నుంచి ప్రాజెక్టులోకి స్వల్పంగా నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జలాశయంలో 0.741టీఎంసీల నీరు నిల్వ ఉంది.



సుంకేసుల జలాశయం నుంచి విడుదల అవుతున్న నీరు

'సుంకేసుల' నుంచి నీటి విడుదల

రాజోలి (ఆంధ్రజ్యోతి) : రాజోలి శివారులోని సుంకేసుల జలాశయం నుంచి బుధవారం వరద నీటిని దిగువకు విడుదల చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో డ్యాంకు ఎగువ నుంచి వరద వస్తోందని, దీంతో బుధవారం సాయంత్రం ప్రాజెక్టు 4 గేట్లు ఒక మీటర్ ఎత్తి 17,600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జేఈ రాజు తెలిపారు. డ్యాం పూర్తి స్థాయి నీటి నిల్వ 1.20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.194 టీఎంసీల నీరు ఉంది. పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం 292.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 291.75 మీటర్ల మేర నీరున్నట్లు జేఈ తెలిపారు.



తెలంగాణ సరిహద్దు అయిజలోని సిందనూర్‌రు గ్రామ సమీపంలో ఆర్డీఎస్ కాలువలో వరద నీరు

తుంగభద్రకు జల కళ

అయిజ (ఆంధ్రజ్యోతి) : కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో తుంగభద్రా నది జల కళను సంతరించుకుంటోంది. కర్ణాటకలోని సిరిగుప్ప, గంగావతి, హగరి, సింధనూర్, గంగావతి ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు ద్వారా తుంగభద్రానదిలోకి వరద వచ్చి చేరుతోంది. తుంగభద్ర డ్యాం దిగువన వచ్చిన వరద నీరు ఆర్డీఎస్ ప్రధాన ఆనకట్టకు చేరుకుంటోంది. ఆనకట్టపై ఒక అడుగు మేర నీరు దిగువన తుంగభద్రకు చేరుతోంది. అక్కడ నుంచి ప్ర .దాన కాలువ ద్వారా తెలంగాణలోని అయిజ, రాజోళి, వడ్డేపల్లి మండలాల మీదుగా ప్రవహించి సుంకేసుల డ్యాంకు చేరుతోంది. ప్రస్తుతం తుంగభద్ర నదికి 19 వేల క్యూసెక్కుల వరద వస్తోందని అధికారులు తెలిపారు. కాలువలో 3 అడుగుల మేర నీరు ప్రవహిస్తోందని ఆర్డీఎస్ ఏఈ రామదాసు తెలిపారు.

క్రైం కార్నర్

శతాధిక వృద్ధుడి మృతి



శతాధిక వృద్ధుడు బకెట్ పెద్ద బాలయ్య

కొత్తకోట, మే 21 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, కొత్తకోట పట్టణానికి చెందిన శతాధిక వృద్ధుడు బకెట్ పెద్ద బాలయ్య (104) బుధవారం మృతి చెందారు. ఆయనకు 10 ఎకరాల పొలం ఉంది. జీవితాంతం వ్యవసాయం చేశాడు. ఆయనకు ఒక కుమారుడు ఉన్నారు.

ఎద్దు పొడిచి వృద్ధుడు..

మానవపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలంలోని జల్లాపురం గ్రామానికి చెందిన చిన్న గోపాల్‌నాయుడు (72) ఎద్దు పొడిచి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి ఆయన కల్లంలో ఎద్దులకు మేత వేసేందుకు వెళ్లాడు. ఓ ఎద్దును పక్కకు నెడుతుండగా అది పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుత బుధవారం ఉదయం మృతి చెందాడు. ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

అమరచింత, మే 21 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అమరచింత ఎస్‌ఐ సురేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, అమరచింత మండల పరిధిలోని పామిరెడ్డిపల్లికి చెందిన దేవర్ల సురేశ్ (38) ఈ నెల 3న ద్విచక్రవాహనంపై నర్వ మండలం నాగిరెడ్డిపల్లికి వెళ్లి గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. గ్రామ సమీపంలోని శ్మశాన వాటిక వద్ద వాహనం అదుపు తప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. అతడికి భార్య భాగ్యమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిడుగు పాటుతో చనిపోయిన పశువులు



మృతి చెందిన పుశువులకు పంచనామా నిర్వహిస్తున్న పశు వైద్య, పశు సంపద అధికారి షేక్ మదార్

చారకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలం, కమాల్‌పూర్‌లో పిడుగు పడి రెండు పవువులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మూడావత్ మంగ్యానాయక్ తన పశువులను పొలంలోని వేపచెట్టు కింద కట్టేశాడు. బుధవారం ఉదయం ఉరుములు, మెరుపులతో వర్షపడింది. అదే సమయంలో పిడుగు పడి పాడి ఆవు, కోడె దూడ అక్కడికక్కడే చనిపోయాయి. పక్కనే ఉన్న ఆవు దూడ ప్రమాదం నుంచి బయట పడింది. చనిపోయిన పశువుల విలువ రూ. 1.40 లక్షలు ఉంటుందని రైతు తెలిపారు. విషయం తెలుసుకొన్న పశువైద్యాధికారి సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

- జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇద్దరు
- నారాయణపేట జిల్లాలో ఒకరు

గద్వాల క్రైం/ ఉండవల్లి/ ఇటిక్యాల/ కోస్గి మే 21 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ఇటిక్యాల హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా కేంద్రం, భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన భగత్‌కుమార్ (22) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తుండేవాడు. ఇటీవల ఉద్యోగం కోల్పోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం ఇటిక్యాల రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి పరమేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

● ఉండవల్లి మండల పరిధిలోని పోతులపాడు, జోగుళాంబ స్టేషన్ల మధ్య రైల్వే ఫ్లైఓవర్ సమీపంలో మంగళవారం రాత్రి ఓ గుర్తుతెలియని వ్యక్తి (55) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలంలో అతడి చేతి కర్ర, దుస్తులు లభించాయి. వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కోరారు.

అప్పులబాధతో మహిళ...

అప్పుల బాధ భరించలేక ఓ మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. నారాయణపేట జిల్లా, గుండుమాల్ మండలంలోని భక్తిమళ్ల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భాగ్యమ్మ (38)ను భర్త వదిలేయడంతో తల్లిగారి ఇంట్లో తమ్ముడి వద్ద ఉంటోంది. జానపద గాయని అయిన ఆమెకు అప్పులు ఎక్కువ కావడంతో జీవితం విరక్తి చెంది, మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు.

బాల్య వివాహం అడ్డగింత

పెద్దకొత్తపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని ఓ గ్రామంలో బుధవారం జరుగుతున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. బాలికకు వివాహం చేస్తున్నట్లు 1098 ద్వారా సమాచారం అందడంతో చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ జిల్లా అధికారి మధుబాబు, చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్ వర్కర్ కవిత, పోలీసులు ఖాజా, అంజి గ్రామానికి చేరుకున్నారు. బాలికను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచారు. వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.



పాలమూరు యూనివర్సిటీ



అకాడమిక్ భవనంపై నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు

ఈ ఏడాది నుంచే లా, ఇంజనీరింగ్ కోర్సులు

- పీయూలో ప్రారంభానికి చురుగ్గా ఏర్పాట్లు
- వసతి గృహాల ఏర్పాటుకు చర్యలు

పాలమూరు యూనివర్సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజనీరింగ్ కోర్సులు ఈ ఏడాదే ప్రారంభం కానున్నాయి. అందుకు అవసరమైన ఏర్పాట్లకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పాలమూరు జిల్లాలో ఉన్నత విద్యావకాశాలు కల్పించడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. అందుకు అనుగుణంగా పాలమూరు యూనివర్సిటీలో 2025-26 విద్యాసంవత్సరం నుంచే లా, ఇంజనీరింగ్ కోర్సులను ప్రారంభించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి, పీయూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. లా, ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇప్పటికే రూ.వంద కోట్లు మంజూరయ్యాయి. అయితే ప్రస్తుతం కళాశాలలకు అవసరమైన శాశ్వత భవనాల నిర్మాణానికి సమయం పట్టనుండటంతో తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నట్లు పీయూ అధికారులు చెప్తున్నారు.

ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

లా కళాశాలలో 3 సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రతీ ఏడాది 60 ప్లస్ 60, మొత్తం 120 సీట్లు, ఎల్ఎల్ఎంలో ఐపీఆర్ (ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్) 30 సీట్లు, అలాగూ ఇంజనీరింగ్ కోర్సులో అన్ని విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతానికి లా, ఇంజనీరింగ్ కోర్సులను ప్రారంభించేందుకు పీయూ అకాడమిక్ భవనంపై అదనపు తరగతి గదుల నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. అలాగే విద్యార్థినులకు వసతి గృహం కోసం మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయం పక్కనున్న దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ భవనాన్ని కలెక్టర్ అనుమతితో లీజుకు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. బాలుర వసతి గృహం కోసం పాలమూరు యూనివర్సిటీ ఎదురుగా ఉన్న రెడ్డి హాస్టల్ భవనాన్ని అద్దెకు తీసుకునే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది కళాశాలల ఏర్పాటుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కోర్సుల్లో విద్యార్థుల ప్రవేశానికి సంబంధించి సెట్‌లు నిర్వహించే యూనివర్సిటీల అనుమతి కూడా తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రారంభం..



ఈ విద్యా సంవత్సరం నుంచే లా, ఇంజనీరింగ్ కోర్సులను ప్రారంబించాలని ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తాం. నూతన భవనాల నిర్మాణం ఆలస్యం కానుండటంతో తాత్కలిక ఏర్పాట్లు చేసేందుకు యత్నిస్తున్నాం. అలాగే వసతి గృహాల ఏర్పాటుకు అవసరమైన భవనాలను గుర్తించాం. వాటిని లీచుకు తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, వైస్ చాన్సలర్, పీయూ

వైభవంగా ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ

ఊర్కొండ, మే 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలం, ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ వైభవంగా కొనసాగింది. దీంతో పాటు గణపతి, నవగ్రహ విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ప్రాతఃకాల పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం హంపీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతి ఆధ్వర్యంలో గణపతి, పూ, నవగ్రహ, శిఖర, గాలిగోపుర, కలశ పూజలు, యంత్రం, విగ్రహాల ప్రతిష్ఠ, అష్టబలి, మహాబలిహరణం, పూర్ణాహుతి, కుంబాభిషేకం నిర్వహించారు.



ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనురుధ్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్ర మంలో ధర్మకర్తల మండలి చైర్మన్ సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రసిడెంట్ ద్యాప నిఖిల్‌రెడ్డి, నాయకులు రమేశ్‌నాయక్, అబ్దుల్‌సమీ, మనోహర్‌రెడ్డి, ఆదినారాయణ, శ్రీనివాసులు, గోపీనాయక్, అయూబ్‌పాషా, చంద్రయ్య, ఆరిఫ్, వేద పండితులు రేవల్లి రాజుశర్మ, దత్తాత్రేయశర్మ, మహేశ్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, ఆలయ ఉద్యోగి మారుతీరావు పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబు, పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ కె.ప్రవీణ

పాలమూరు యూనివర్సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఎల్‌బీ మొదటి, మూడవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ బుధవారం విడుదల చేశారు. మొదటి సెమిస్టర్‌లో 74 శాతం, మూడవ సెమిస్టర్‌లో 85 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. ఫలితాలను తెలుసుకునేందుకు అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ కే ప్రవీణ తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబు, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శాంతిప్రియ, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన కంప్యూటర్లు

- సెంట్రల్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షకు ఆటంకం
- కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన
- మహబూబ్‌నగర్ ఫాతిమా విద్యాలయంలో ఘటన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 21 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ యూనివర్సిటీలో అండర్ గ్రాడ్యుయేషన్ ప్రవేశ పరీక్ష (సీయూఈటీ)కు ఆటంకం కలిగింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం, క్రిస్టియన్‌పల్లిలోని ఫాతిమా విద్యాలయంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. దీంతో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరీక్ష కేంద్రం ముందు ఆందోళన చేపట్టారు. ఈనెల 20, 21 తేదీల్లో ఈ పరీక్ష జరగాల్సి ఉంది. బుధవారం ఉదయం పరీక్ష రాసేందుకు విద్యార్థులు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కేంద్రం వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో భారీ వర్షం పడటంతో కేంద్రంలోని కంప్యూటర్లు మొరాయించాయి. నిర్వాహకులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో పరీక్ష నిర్వహించలేకపోయారు. దీంతో విద్యార్థులు ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత కంప్యూటర్లు పనిచేయడంతో మధ్యాహ్నం నిర్వహించాల్సిన పరీక్ష యధావిధిగా కొనసాగింది.



పరీక్ష కేంద్రం వద్ద అందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నల్లమల గ్రామాలకు ఆర్టీసీ బస్సు పునఃప్రారంభం

- ఊరూరా బస్ సర్వీసుకు పల్లె జనం ఘన స్వాగతం



లింగాలకు ఆర్టీసీ బస్సు పునఃప్రారంభంతో మారేడుమానుదిన్నెలో స్వాగతం పలికిన మాజీ ప్రజాప్రతినిధులు

పెద్దకొత్తపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి మండలాల సరిహద్దు గిరిజన తండాలు, గ్రామాలకు ఎట్టకేలకు కొల్లాపూర్ నుంచి లింగాల మండలానికి ఆర్టీసీ బస్సును అధికారులు బుధవారం పునఃప్రారంభించారు. దీంతో మార్గమధ్యలోని నార్లాపూర్, చెంచుగూడెం, వేడుకరావుపల్లి తండా, మారేడు మానుదిన్నె, చంద్రబండతండా, కొత్తయాపట్ల, అంబటిపల్లి, అవుసలికుంట గ్రామాల ప్రజలు మాజీ ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. ఆయ గ్రామాల్లో కొబ్బరికొమ్మలతో అలంకరించి ఆర్టీసీ బస్సుకు ఘన స్వాగతం పలికారు. రెండేళ్ల క్రితం ప్రారంభమై అర్ధంతరంగా బస్సు రాకపోలు నిలిచిపోయాయి. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో నల్లమల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించారని అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులు మళ్లీ నల్లమల గ్రామాలకు రావడంతో ప్రజలు స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు. అయా గ్రామాలకు మళ్లీ ప్రారంభమైన బస్సుల్లో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు గౌరమ్మ, చంద్రయ్యయాదవ్‌తో పాటు పలువురు నాయకులు ప్రయాణించారు. మారేడు మానుదిన్నె, నార్లాపూర్ గ్రామాల ఎంపీటీసీ మాజీ సభ్యులు వెంకటస్వామిగౌడ్, రామన్‌గౌడ్, చంద్రబండతండా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కేతావత్ శంకర్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ బాలునాయక్, మాజీ సర్పంచ్‌లు గన్నోజు కృష్ణమాచారి, బాలస్వామిశెట్టి, అరవింద్, నార్లపూర్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలునాయక్ తదితరులు డిపో మేనేజర్ ఉమాశంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ

జడ్చర్ల, మే 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణం, సిగ్నల్‌గడ్డ సమీపంలోని రాఘవేంద్రస్వామి దేవాలయంలోని హుండీ మంగళవారం అర్ధరాత్రి తర్వాత చోరీకి గురయ్యింది. జడ్చర్ల ఎస్‌ఐ జయప్రసాద్ తెలిపిన వివరాల మేరకు... రాఘవేంద్రస్వామి మఠంలో రాత్రి పూజల అనంతరం అర్చకులు గుడికి తాళం వేసి వెళ్లిపోయారు. అర్ధరాత్రి తర్వాత దొంగలు తాళాలు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. హుండీని ఎత్తుకెళ్లి అందులోని నగదును దోచుకున్నారు. ఆ తర్వాత దాన్ని సమీపంలోని రైలు పట్టాలపై పడేశారు. బుధవారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు చోరీ జరిగినట్లు గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. క్యూస్ టీంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హుండీలో దాదాపు రూ.60 వేల వరకు ఉండొచ్చని అర్చకులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీసీఎం, బైక్ ఢీ

- వ్యక్తికి గాయాలు

జడ్చర్ల, మే 21 (ఆంధ్రజ్యోతి) : డీసీఎం, ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండల కేంద్రానికి చెందిన వినోద్ బుధవారం మధ్యాహ్నం జడ్చర్ల నుంచి భూత్పూర్ వైపు వెళ్తున్నాడు. మండలంలోని చిట్టబోయిన్‌పల్లి సమీపం లోని మలుపు వద్ద వెనుక నుంచి వచ్చిన డీసీఎం బైక్‌ను ఢీకొన్నది. ప్రమాదంలో గాయపడిన వినోద్‌ను స్థానికులు 108 అంబులెన్సులో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

సరి'హద్దులు' దాటుతున్న రేషన్ బియ్యం

- రూటు మార్చిన బియ్యం మాఫియా
- బల్గెర, గట్టు మీదుగా కర్ణాటకకు తరలింపు
- రాత్రి వేళ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిల్

గట్టు, మే 21 (ఆంధ్రజ్యోతి) : పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో సరిహద్దులు దాటుతోంది. ఇంతకాలం జోగుళాంబ గద్వాల జిల్లాలోని నందిన్నె మీదుగా రేషన్ బియ్యం కర్ణాటకకు తరలుతుండేది. కాగా బియ్యం మాఫియా ఇప్పుడు రూటు మార్చింది. కర్ణాటక రాష్ట్రానికి అతి సమీపంలో ఉండే గట్టు మండల పరిధిలోని పల్లెలను కేంద్రంగా చేసుకొని అక్రమ వ్యాపారాన్ని సాగిస్తోంది. వివిధ ప్రాంతాల్లోని లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్న అక్రమార్కులు గట్టు మండలంలోని గ్రామాల్లో నిల్వ చేస్తున్నారు. ఆ తర్వాత రాత్రి వేళ డీసీఎం, బొలెరో వ్యాన్లు, ఇతర వాహనాల్లో కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

తెలంగాణ, కర్ణాటక సరిహద్దు అంతర్రాష్ట్ర రహదారిపై బల్గెర వద్దనున్న చెక్ పోస్టులో తనిఖీలు సక్రమంగా జరుగకపోవడం అక్రమ వ్యాపారులకు అలుసుగా మారింది. దీనికి తోడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వారికి వరంగా మారింది. దీంతో బియ్యం అక్రమ రవాణా మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. సమాచారం అందితే అడపాదడపా పోలీసులు తనిఖీలు చేసి, రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నారు. అయినా బియ్యం అక్రమ రవాణా ఆగడం లేదు. అధికారుల కన్ను గప్పి రాత్రి వేళ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం.



గట్టు మండలంలో రేషన్ బియ్యంతో బల్గెర చెక్‌పోస్టు దగ్గర గట్టు పోలీసులకు పట్టుబడ్డ వాహనం (ఫైల్)

పల్లెల మీదుగా పక్క రాష్ట్రానికి..

అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి, రాజోలి, ఇటిక్యాల మండలంలోని పలు గ్రామాల్లో అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని సేకరించి అయిజ ద్వారా బల్గేర చెక్‌పోస్టు మీదుగా కర్ణాటకకు తరలిస్తున్నారు. మల్దకల్, తదితర గ్రామాల నుంచి సేకరించిన బియ్యాన్ని గట్టు మీదుగా వయా చింతలకుంట దారిలో కర్ణాటకకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గద్వాల ప్రాంతం నుంచి సేకరించిన బియ్యాన్ని మార్లబీడు, ర్యాలంపాడుల మీదుగా నెట్టెంపాడు కాలువల వెంట ఉన్న దారుల్ల తరలిస్తున్నారు.

తనిఖీల్లో పట్టుబడుతున్న బియ్యం

ఇటీవల కాలంలో గట్టు పోలీసుల తనిఖీల్లో రాయపురం నుంచి రాయచూరుకు తరలిస్తున్న 50 బస్తాల బియ్యాన్న గట్టు పెట్రోలు పంపు వద్ద పోలీసులు పట్టుకున్నారు. అయిజ నుంచి రాయచూరుకు తరలిస్తున్న 40 బస్తాల బియ్యాన్ని గొర్లఖాన్ దొడ్డి రోడ్డులో, 110 బస్తాల బియ్యాన్ని ఇందువాసి శివారులో పట్టుకున్నారు. గట్టు శివారులోని ర్యాలంపాడు కాలువ వీదుగా రాయచూరుకు తరలిస్తున్న 35 బస్తాల బియ్యం, అయిజ మండలం వెంకటాపురం నుంచి రాయచూర్‌కు తరలిస్తున్న 65 బస్తాల రేషన్ బియ్యం పోలీసులు తనిఖీల్లో పట్టుబడింది. ఇలా వరుసగా గట్టు మండలంలో రేషన్ బియ్యం పట్టుబడటంతో అనుమానం వచ్చిన పోలీసులు అరా తీశారు. దీంతో బియ్యం మాఫియా రూటు మార్చి గట్టు మండలం ద్వారా కర్ణాటకకు రవాణా చేస్తున్నట్లు వెల్లడైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పూర్తి స్థాయి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటర్వ్యూ..

రైతులు విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

- చారగొండ రాజు, వ్యవసాయ అధికారి



కొండనూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి చారగొండ రాజు అన్నారు. ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ షాపుల నుంచి విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా యజమాని సంతకంతో కూడిన రసీదు పొంది, దాన్ని భద్రపర్చుకోవాలని ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ఒకే పంట సాగు చేస్తే దిగుబడి ఎలా ఉంటుంది?

రైతులు తమ పొలాల్లో ఒకే పంట సాగు చేయడంతో దిగుబడి తక్కువగా వస్తుంది. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వేసిన పంట వేయకుండా పంట మార్పిడి చేసి పంటలను సాగు చేస్తే పెట్టుబడి తక్కువగా వచ్చి దిగుబడి ఎక్కువగా వస్తుంది. దీంతో రైతులకు లాభం చేకూరుతుంది.

సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పిస్తున్నారా?

సేంద్రియ ఎరువుల తయారు చేసుకునే విధానం, పంటలకు ఏ విధంగా వాడాలనే వాటిపై గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

రైతులు వేసవిలో దుక్కులు చేయడంతో లాభాలు ఏమిటి?

రైతులు తమ పొలాలను సాగు చేసే ముందు వేసవికాలంలో దుక్కులను లోతుగా దున్నడంతో వాటిలో ఉన్న చీడపురుగులు నశిస్తాయి. వేడికి భూమిలో తేమ శాతం పెరుగుతుంది. దీంతో పంట మొదటి దశ నుండే మెరుగుపడి రైతుకు మేలు చేకూరే విధంగా ఉంటుంది.

న్యూస్ బాక్స్

కల్వకుర్తిలో వర్షం

కల్వకుర్తి, మే 21 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో బుధవారం ఉదయం వర్షం కురిసింది. ఉదయమే మేఘావృతమై ఉండి ఒక్కసారిగా వర్షం పడింది. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఉన్న కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యానికి కవర్లు కప్పి ఉండడంతో నష్టం జరగలేదు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ ప్రారంభం



బాచారంలో రైతుల విశిష్ట గుర్తింపు కార్డు ప్రక్రియను చేపట్టిన ఏఈవో

పెద్దకొత్తపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలకంగా మారిన ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను బుధవారం మండల పరిధిలోని బాచారం గ్రామంలో నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. భూమి ఉన్న ప్రతీ రైతు తప్పనిసరిగా ఈ ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు సంబంధించిన వివరాలను వ్యవసాయశాఖకు అందించాలని పెద్దకొత్తపల్లి క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారి ముజీబ్ తెలిపారు. తమ పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జత చేసిన మొబైల్ ఫోన్ నెంబరు అందజేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ బీమా యోజన రాష్ట్ర కిసాన్ వికాస్ యోజన వంటి పథకాల అమలులో ఈ విశిష్ట సంఖ్య తప్పనిసరిగా అవసరమని ఆయన పేర్కొన్నారు. వచ్చే 20వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధులు విడుదల కావాలంటే ఈ 11సంఖ్యల రైతు విశిష్ట సంఖ్యకు తప్పనిసరి పొందాలని ఆయన తెలిపారు. పెద్దకొత్తపల్లి, జొన్నలబొగుడ, బాచారం గ్రామాల రైతులు దయ చేసి వ్యవసాయ భూమి ఉన్న ప్రతీ రైతు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

మొక్కలను గ్రేడింగ్ చేయాలి



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఇసాక్‌హుసేన్

చారకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి) : నర్సరీలో ఏపుగా పెరిగిన మొక్కలను గ్రేడింగ్ చేయాలని ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లిలో నర్సరీ, ఎన్ఆర్ఈజీఎస్ పనులు, మస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో పెరిగిన మొక్కలను తొలగించాలని వచ్చే వర్షాకాలం నాటికి నర్సరీలోని మొక్కలను సిద్ధం చేయాలని అన్నారు. మొక్కలు ఎండిపోకుండా రోజుకు రెండు పూటలా నీళ్లు పెట్టాలని ఆన సిబ్బందికి సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున మొక్కలు నాటాల్సి ఉంటుందని, సిద్ధం చేయాలని సూచించారు. ఉపాధి కూలీలు పనులు చేసే కొలత ప్రకారం డబ్బులు వస్తాయన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఖదీర్ ఉన్నారు.

తప్పని తాగునీటి ఇక్కట్లు

- అంతంత మాత్రంగానే మిషన్ భగీరథ నీళ్లు
- గ్రామాల్లో సరిపడా అందని తాగునీరు
- ట్యాంకర్లతో తాగునీరు తెచ్చుకుంటున్న ప్రజలు

తాడూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఐరవై రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరిపడా రాకపోవడం మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ప్రధానంగా మండలంలోని భలాన్‌పల్లి, సిర్సవాడ, పాపగల్, వల్లభాయిపల్లి, యత్మతాపూర్, తుమ్మలసూగూరు, ఇంద్రకల్, ఎట్టిధార్‌పల్లి వంటి గ్రామాల్లో తాగునీటి కొరత ఉంది. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదంటూ ఆయా గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం పూర్తవుతున్న నేపథ్యంలో మరో 20 రోజులైతే సంపూర్ణంగా నైరుతి రుతుపవనాలతో వర్షాకాలం ప్రారంభమవుతున్న తరుణంలో తాగునీటి సమస్య తీరే అవకాశం ఉంటుంది. అంత వరకు గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా స్థానికంగా ఉండే బోరుబావులను పునరుద్ధరించి తాగునీటిని సరఫరా చేయడంతో పాటు మిషన్ భగీరథకు సంబంధించిన తాగునీటిని మరికొంచెం ఎక్కువగా వచ్చే విధంగా అధికారులు పరిష్కరించడానికి కృషి చేస్తే బాగుంటుంది. ప్రజలకు సరిపడా తాగునీరు అందకపోవడంతో ప్రధానంగా భలాన్‌పల్లి గ్రామంలో ట్యాంకర్లతో తాగునీళ్లను తరలించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి నివారణ చర్యలు తీసుకుని ప్రజలకు సరిపడా తాగునీరు అందించాలని గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా కొన్ని గ్రామాలకు సరఫరా అయ్యే పైపులైన్ల వద్ద లీకేజీలు ఏర్పడడం వల్ల నీళ్లు నడం వల్ల మధ్య మధ్యలో ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందికరంగా మారుతోంది.



భలాన్‌పల్లి గ్రామంలో ట్యాంకర్‌తో నీటిని తీసుకెళ్తున్న గ్రామస్థులు

20 రోజులుగా తాగునీటికి ఇబ్బంది



20 రోజులుగా తాగునీళ్లు సరిపడా రావడం లేదు. ఈ సమస్యకు సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సరఫరా సాఫీగా కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, భలాన్‌పల్లి

తాగునీటి సరఫరా బాగానే ఉంది



ప్రస్తుతం మండలంలో తాగు నీళ్ల మిషన్ భగీరథ పథకం ద్వారా అందిస్తున్నప్పటికీ ఇబ్బందులు లేకుండా అన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నాం. వేసవి కాలంలో నమస్య కొంత జఠిలంగా ఉండేది. అయినప్పటికీ గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లతోపాటు బోర్ల నుంచి కూడా నీళ్లను ప్రజలకు సరఫరా చేస్తున్నాం. కొన్ని గ్రామాల్లో పైపులైన్లలో ఉన్న సమస్యల వల్ల కొంతమందికి నల్లాల ద్వారా తాగునీటి సరఫరా కొంత ఇబ్బందికరంగా మారింది. క్షేత్రస్థాయి సిబ్బందితో ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

- శివశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

చెంచుల అభివృద్ధిని ఓర్వలేకపోతున్నావ్

- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఫైర్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : చెంచుజాతిని అభివృద్ధి చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఓర్వలేక పోతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అచ్చంపేట నియోజకవర్గంలోని చెంచుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి ఇందిర సౌరగిరి జలవికాసం పథకం తీసుకొచ్చి జనస మీకరణ, చెంచుల ఉత్సాహం, హక్కుల చేర్చుకొని ఆనందభాష్పాలు రాల్చిన వారి ఆనందాన్ని చూసి మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తట్టుకోలేక ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రూ.100 కోట్లకు అమ్ముడుపోయిన దొంగది నువ్వు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే స్థాయి నీకులేదన్నారు. ముఖ్యమంత్రి ప్రారంభించిన పథకం అమలుకు నోచుకోదని ఇష్టంవచ్చినట్లు మాట్లాడుతున్నావు కాదని, నువ్వు బోరు వేసుకున్నా సోలార్ పంపుసెట్టు ఇస్తామని, అప్పుడైనా అర్థమవుతుందన్నారు. నువ్వు నల్లమల బిడ్డవు కాదని, వలస బిడ్డవని, అందుకే అచ్చంపేట మీద నీకు ప్రేమలేదని ఎమ్మెల్యే వాపోయారు. తప్పుడు మాటలు మాట్లాడితే, మేము నీ తప్పులను సాక్ష్యాలతో ప్రజల ముందు పెడతామన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, నాయకులు కాశన్న యాదవ్, గోపాల్‌రెడ్డి, మల్లేష్, గోరేశంకర్, వెంకటయ్య, బాబు, ఖాదర్, వినోద్ పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- నాగర్‌కర్నూల్‌లో వక్ఫ్ బచావో జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం
- పాల్గొన్న పలు పార్టీలు, ప్రజా సంఘాల వక్తలు



జిల్లా కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం భారత రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని రౌండ్ టేబుల్ సమావేశంలో పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. బుధవారం వక్ఫ్ బచావో జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బిస్ మామ్ పుజ్ మజీద్ ఆవరణలో పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వక్ఫ్ కాన్ఫరెన్స్ మేనేజింగ్ కమిటీ కార్యదర్శి పఠాన్ అబ్దుల్లా ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆనంద్జీ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్, జైభీం దీక్షా సమితి వ్యవస్థాపకుడు వంకేశ్వరం నిరంజన్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి గూటవిజయ్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్ రహమాన్, క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు సంపత్‌కుమార్ పాల్గొని వక్ఫ్ సవరణ చట్టాన్ని ముక్త కంఠంతో వ్యతిరేకించారు. దేశంలో ముస్లిం మైనార్టీలను అణచివేసే కుట్రలో భాగంగానే బీజేపీ వక్ఫ్ సవరణ చట్టం తీసుకువచ్చిందని ఆరోపించారు. ఈ నెల 31న జిల్లా కేంద్రంలోని జెడ్పీ మైదానంలో నిర్వహించ తలపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ వ్యతిరేక సభను జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు నబీల్, బీఎంపీ పార్లమెంటు ఇన్‌ఛార్జ్ గద్దం విజయ్, ముస్లిం హక్కుల సాధన సమితి అధ్యక్షుడు నిజాం, వక్ఫ్ బచావో జేఏసీ నాయకులు హమీ ద్, ఖాజామొయినుద్దీన్, అలీం, నిజాం, సుల్తాన్, షేక్ ఫరీద్ అహ్మద్, యాఖుబ్ బాజాల్, సాదిక్ పాషా, హబీబ్‌ఖాన్, అనీస్ అహ్మద్ ఖాన్, రఫీ, నసీర్ అహ్మద్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

నవ భారతానికి బాటలు వేసిన మహనీయుడు

- వర్ధంతి సందర్భంగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



అచ్చంపేట : రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసినివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అచ్చంపేటటౌన్/ ఉప్పునుంతల మే 21 (ఆంధ్రజ్యోతి) : దివంగత, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళి అర్పించారు. పట్టణంలోని రాజీవ్ విగ్రహానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా ఉప్పునుంతలలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవ భారతానికి బాటలు వేసిన మహనీయుడు రాజీవ్‌గాంధీ అని అన్నారు. దేశానికి కంప్యూటర్‌ని పరిచయం చేసిన మహోన్నతమైన వ్యక్తి రాజీవ్‌గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు కాశన్న యాదవ్, శేఖర్, రము, సుశీల, రామనాథం, నాయకులు రేణయ్య, శేఖర్, శ్రీను, తిరుపయ్య, గణేష్, పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

కొల్లాపూర్ : దివంగత, మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు అన్నారు. బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కొల్లాపూర్ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి రంగినేని జగదీశ్వరుడు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకునమోని రాము యాదవ్, కొల్లాపూర్ మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు, మండల మాజీ సర్పంచులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మేకల నాగరాజు, రహీంపాషా, ఎండీ ఇక్బాల్, పసుపుల నరసింహ, మేకల కిరణ్ యాదవ్, కమలాకర్‌రావు, రమేష్ ముదిరాజ్, వెంకటేష్ యాదవ్, కృష్ణమ్మ నాయుడు, రెడ్డిసత్యం, కర్నె వాసు, అన్వర్, దిలీప్, వెంకటేష్, రమేష్ గౌడ్, బింగి ఎల్లేష్, ఆశోక్, శేఖర్, బిజ్జ రమేష్ బాబు, అంజద్ పాల్గొన్నారు.

రాజీవ్ ఆశయాలను కొనసాగిద్దాం

కల్వకుర్తి : దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిద్దామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బృంగి ఆనంద్‌కుమార్ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధానిగా రాజీవ్ గాంధీ ఉన్న కాలంలో శాస్త్ర, సాంకేతిక రంగాలను అభివృద్ధిపర్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్, నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శ్రీను, సాబీర్, శ్రీకాంత్, సుజాన్, ఉస్మాన్ ఉన్నారు.

కలెక్టరేట్ శానిటేషన్ సిబ్బంది వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శానిటేషన్ సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో శానిటేషన్ పనులను చేస్తున్న సిబ్బందికి సంబంధిత కాంట్రాక్టర్ ఏడు నెలలు వేతనాలు ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న సిబ్బందికి సకాలంలో చెల్లించపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో వేతనాలు చెల్లించడంతో పాటు కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిజ్వాన్, నాగమణి, ఎల్లమ్మ, శ్రీదేవి, అలివేలు, రేణుక, నాగయ్య, వెంకటేష్, కాశన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తాడూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్సవాడ గ్రామంలో రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కేశవులు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బుధవారం సాయంత్రం కేశవులు ఇంటికెళ్లి వారి తీసుకుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే వెంట నాయకులు తిరుపతిరెడ్డి, రమణ, మధుసూదన్‌రెడ్డి, జలీల్‌తో పాటు సిర్సవాడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితుల పక్షాన పోరాడుతాం

- మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య



దళితుల భూములను పరిశీలిస్తున్న చెన్నయ్య

వంగూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : దళితులకు అన్యాయం జరిగితే చూస్తు ఊరుకోబోమని, న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడి పోరాడుతామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. బుధవారం మండలంలోని తిప్పారెడ్డిపల్లి గ్రామంలో కబ్జాకు గురైన డొక్కి రాములు, గోపమ్మ యాదయ్యలకు చెందిన భూములను చెన్నయ్య రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పరిశీలించారు. గ్రామానికి చెందిన కొందరు భూస్వాములు దళితుల భూములను కబ్జా చేసి వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నందున, ఆతనిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తప్పుడు సర్వే చేయించి భూములను కబ్జా చేయడం సరికాదని, న్యాయం జరిగే వరకు దళితుల పక్షాన పోరాడుతామన్నారు. కార్యక్రమంలో నాగరాజు, అరుణ్ కుమార్, సంతోష్, రేణయ్య తదితరులు పాల్గొన్నారు.


నంబర్ ప్లేట్లు లేని వాహనాలు సీజ్

- అచ్చంపేటలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు

అచ్చంపేట టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ ఆదేశాల మేరకు అచ్చంపేట పట్టణంలో బుధవారం సాయంత్రం డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంట పాటు నిర్వహించిన తనిఖీల్లో నంబర్ ప్లేట్లు లేని, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వాహనాలు నడిపిన వారిని పట్టుకొని వారి వాహనాలు సీజ్ చేశారు. తనిఖీల్లో 60 ద్విచక్ర వాహనాలు, 4ట్రాక్టర్లు, 6 కార్లు, 4 బొలెరో వాహనాలు పట్టుకొని జరిమానా విధించారు. వాహన చోదకులకు రహదారి నిబంధనల గురించి, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా, రిజిస్ట్రేషన్లు లేని వాహనాలు నడపరాదని, రహదారి నిబంధనలు తప్పకుండా పాటించాలని అవగాహన కల్పించారు. అచ్చంపేట సీఐ రవీందర్, అచ్చంపేట సర్కిల్ ఎస్ఐ పోలీసు కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు

- డీఈవో రమేష్ కుమార్



జిల్లా కేంద్రంలో గోదాంకు చేరుకున్న పుస్తకాల వాహనం వద్ద డీఈవో రమేష్‌కుమార్, సిబ్బంది

నాగర్‌కర్నూల్ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభమైన మొదటి రోజే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను అందజేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాఠ్యపుస్తకాల గోదాంను ఆయన పరిశీలించారు. జిల్లా లోనున్న ప్రభుత్వ యాజమాన్యాలకింద 70,390 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారందరికీ అన్నిసబ్జెక్టులు కలిపి 3,98,660 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా ఇప్పటికే 80 శాతం జిల్లాకు చేరుకున్నాయని పేర్కొన్నారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని, ఆదే రోజు విద్యార్థులు అందరికి పాఠ్యపుస్తకాలు అందిస్తామని తెలిపారు. డీఈవో వెంట జిల్లా పాఠ్యపుస్తకాల గోదాం మేనేజరు నరసింహ, సిబ్బంది నాగేందర్, వెంకటేశ్వర్లు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించాలి

- రైతులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎం సిద్దప్ప

తెలకపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి) : తక్కువ నీటితో పంటలు సాగు చేసి అధిక దిగుబడి ఎలా సాధించాలో పలువురు శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని గౌరారం గ్రామంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పంటల సాగులో తక్కువ పెట్టుబడి ఎక్కువ దిగుబడి పొందడానికి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ ఎంఎం. కాడ సిద్దప్ప మాట్లాడుతూ తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించే పద్ధతులు, మైక్రో ఇరిగేషన్, డ్రిప్ సిస్టమ్, స్ప్రింక్లర్ పద్ధతులు పాటించడం ద్వారా ముఖ్యం నేరుగా నీరు అందడం వల్ల వేర్లు ఎదుగుదల మెరుగుపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి జి. సంతోష్, ఎం. వెంకటేష్, చెన్న జంబులు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి : కలెక్టర్

నాగర్‌కర్నూల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వ్యాప్తంగా వరి కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 75వేల మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేసినట్లు జిల్లా అధికారులు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలు, రవాణా వాహనాల కొరత రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి షైదర్ అలీ, రాజేందర్, డీఆర్‌డీవో చిన్న ఓబులేష్, డీసీవోరమణారావు, అధికారులు పాల్గొన్నారు.

విద్యాబోధన పటిష్టం చేయడానికే శిక్షణ

- ఉపాధ్యాయుల శిక్షణలో కలెక్టర్ బదావత్ సంతోష్



పెంట్లవెల్లి జడ్పీహెచ్ పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

పెంట్లవెల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల విద్యాబోధన పటిష్టం చేయడం కోసమే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సందర్శించి, మాట్లాడారు. ప్రతీ ఉపాధ్యాయుడు ఉత్తమ బోధకుడిగా ఎదిగితేనే విద్యార్థులు విజేతలుగా మారగలరని అన్నారు. బోధన నైపుణ్యాలు మెరుగుపడితే పఠన లక్ష్యం, విశ్లేషణాత్మక ఆలోచన, సామర్థ్యాలు విద్యార్థుల్లో లక్ష్య నిర్దారణ అలవాటు చేయాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన పద్ధతులను అవలంభించాలన్నారు. కలెక్టర్ వెంట అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్, ఎంఈవో ఇమ్మానుయేల్ ఉన్నారు. వెంకటయ్య, ఆయా మండలాల ఎంఈవోలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తరగతుల పర్యవేక్షణ

కొల్లాపూర్ : కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రెండవ రోజు కొనసాగుతున్న ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్ బుధవారం పర్యవేక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు తల్లిదండ్రులకు వివరించి పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎంఈవో ఇమ్మానుయేల్, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు సీఆర్పీలు, ఎమ్మార్పీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకోవాలి

కోడేరు : ఉపాధ్యాయులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ విద్యార్థులకు బోధించి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో భాస్కర్‌శర్మ అన్నారు. బుధవారం స్థానిక జడ్పీహెచ్ పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ రెండవ రోజు కొనసాగింది. కార్యక్రమంలో జిల్లా మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి భవిష్యత్‌కు ప్రాథమిక విద్య కీలకం

తిమ్మాజిపేట : విద్యార్థి భవిష్యత్‌కు ప్రాథమిక విద్య కీలకమని ఎంఈవో సత్యనారాయణశెట్టి అన్నారు. ఉపాధ్యాయులో బోధన సామర్థ్యాలను పెంపొందించడానికి రెండు రోజులుగా స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో జరుగుతున్న శిక్షణ తరగతులను ఎంఈవో పరిశీలించి, మాట్లాడారు. విద్యార్థికి చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు చేయడం, వరిసరాలపై అవగాహన కల్పించాలని అన్నారు. శిక్షణ ఉపాధ్యాయులు జయపాల్‌రెడ్డి, సుధీర్, సుదర్శన్‌గౌడ్, విజయలక్ష్మి, కార్తిక్, ఎల్లయ్య పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

కల్వకుర్తి : ఉపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏరమేష్‌కుమార్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని సత్యసాయి సమావేశ మందిరంలో జిల్లాలోని కల్వకుర్తి, ఊర్కొండ, వంగూరు, చారకొండ మండలాల హెచ్ఎంలకు ఉపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ తరగతుల శిబిరాన్ని బుధవారం పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రవీందర్ పాల్గొన్నారు. సమయపాలన పాటించి ఈ శిక్షణలో రిసోర్స్ పర్సన్లు చెప్పిన విషయాలను, మెళకువలను శ్రద్ధగా విని మీ మీ పాఠశాలల్లో విద్యార్థులకు చక్కగా బోధించి వారి విద్యాభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. ఎంఈవో శేఖర్‌సింగ్ ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా, ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి బరపటి వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు బాటలు వేయండి

పెద్దకొత్తపల్లి : విద్యార్థుల భవితకు బాటలు వేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్ ఉపాధ్యాయులకు సూచించారు. పెద్దకొత్తపల్లి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎంవో షర్ఫుద్దీన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించి ఈ శిక్షణలో రిసోర్స్ పర్సన్లు చెప్పిన విషయాలను, మెళకువలను శ్రద్ధగా విని మీ మీ పాఠశాలల్లో విద్యార్థులకు చక్కగా బోధించి వారి విద్యాభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. ఎంఈవో శేఖర్‌సింగ్ రెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణలో ప్రతీ ఉపాధ్యాయుడు చర్చలో పాల్గొని తమకున్న సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు సాయిప్రకాశ్‌రెడ్డి, మహేష్‌బాబు, సువర్ణ, లక్ష్మీపతి, శివ, భారతి, లోకేశ్వర్, ప్రమీల, సీఆర్పీలు ఈశ్వర్, రాము, మురళీ, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.